క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



మాచారెడ్డి/కామారెడ్డి టౌన్: పాల్వంచ మండల కేంద్రానికి చెందిన కావటి నర్సింలు(పెద్దులు) 12 రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రెక్కాడితే కాని డొక్కాడని నర్సింలు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు ఈ విషయం తెలిసి హైదరాబాద్‌లోని తన నివాసంలో నర్సింలు కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేశారు. అలాగే గృహలక్ష్మి పథకం కింద ఇల్లు ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు కూచని శేఖర్, స్వామి, దేవరాజు ఉన్నారు.

స్టడీ సెంటర్ ప్రారంభం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కృష్ణాజీవాడిలో శనివారం స్టడీసెంటర్‌ను సర్పంచ్ జంగం భూషణం ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన వడ్ల రమేష్ అనే వ్యక్తి తన తండ్రి విఠల్ పేరుపై ఈ స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఈ సదవకాశాన్ని చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విద్యార్థులు, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.

పద్మశాలీలు భారీగా తరలిరావాలి

దోమకొండ: చలో కోరుట్ల సభకు మండలానికి చెందిన పద్మశాలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని దోమకొండ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొమ్మెర గంగాధర్ కోరారు. శనివారం వారు మాట్లాడారు. పద్మశాలీలకు చట్ట సభల్లో సమన్యాయం కావాలని కోరుతూ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక మార్కండేయ మందిరం నుంచి ప్రత్యేకంగా బస్సులు బయలు దేరుతాయన్నారు. సంఘం కోశాధికారి గణేష్ ఉన్నారు.

నవోదయలో పీటీసీ ఎన్నిక

నిజాంసాగర్(జుక్కల్): జవహర్ నవోదయ నిజాంసాగర్ విద్యాలయంలో శనివారం పేరెంట్, టీచర్స్ కౌన్సిల్(పీటీసీ)ను ఎన్నుకున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జె.యోహాన తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి విద్యాలయ సమగ్ర అభివృద్ధి కోసం తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 16 బ్లాక్‌ల నుంచి 16 మంది తల్లిదండ్రులను ఎన్నుకున్నామని చెప్పారు. ఉపాధ్యాయ బృందం నుంచి అశుతోష్, కిరణ్, శిరీష, కోటేశ్వర్, డాక్టర్ ఎస్.శ్యాం ప్రసాద్‌ను సభ్యులుగా ఎన్నికయ్యారన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ కరపత్రాలను శనివారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ ఆవిష్కరించారు. సంతోష్ మాట్లాడుతూ.. ఈ నెల 20న ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ, ఉద్యోగ, దళిత గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి దళిత గిరిజన ఆత్మగౌరవ సభను పిట్లంలోని రాజరాజేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఆకునూరి మురళి(ఐఏఎస్), ప్రొఫెసర్ కాశిం, తదితరులు వస్తున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హనుమ బంగారు రవి, సంగు గోవర్ధన్, గైని బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కామారెడ్డి టౌన్: ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యలపై అలుపెరగకుండా పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని జిల్లా కన్వీనర్ శివ ప్రసాద్ అన్నారు. రుత్విక్, సంపత్ కుమార్, జస్వంత్ తదితరులున్నారు.

110వ రోజుకు చేరిన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని పర్యావరణాన్ని పరిరక్షించాలని శనివారం కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 110వ రోజుకు చేరుకున్నాయి. పలువురు దీక్షా శిబిరంలో కూర్చుని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దెబ్బతిన్న పల్లె రోడ్లు

- భారీ వర్షాలకు బీటీ రోడ్లు ధ్వంసం
- మరమ్మతులు చేయాలని వేడుకొంటున్న గ్రామస్తులు



వర్షాలకు ధ్వంసమైన తిర్మన్‌పల్లి తండా బీటీ రోడ్డు (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసమయ్యాయి. మునుపెన్నడూ లేని విధంగా కురిసిన వర్షాలకు చాలా చోట్ల రోడ్లు, కల్వర్టులు పాడయ్యాయి. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. సదాశివనగర్ మండల కేంద్రంతో పాటు తిర్మన్‌పల్లి తండా, తిర్మన్‌పల్లి, మర్కల్, అమర్లబండ, ధర్మారావ్‌పేట్, మోడెగాం, ఉత్తునూర్, వజ్జపల్లి గ్రామాల బీటీ రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లపై భారీ గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. ముందస్తుగా అధికారులు దృష్టి సారించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. నష్ట తీవ్రతను అంచనా వేయడానికి పంచాయతీ రాజ్ శాఖాధికారులు రోడ్ల పరిస్థితిపై సర్వే నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా అమర్లబండ కల్వర్టు

అమర్లబండ గ్రామంలో కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు ఘోరంగా దెబ్బతిన్నది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులు విజ్ఞప్తులు చేస్తున్నా మోక్షం లభించడం లేదు. అధికారులు దృష్టి సారించి ధ్వంసమైన కల్వర్టుకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. అలాగే తిర్మన్‌పల్లి తండాకు వెళ్లే బీటీ రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నారు.



సదాశివనగర్ శివారులో ధ్వంసమైన కల్వర్టు

రోడ్డు నాణ్యతతో వేయాలె..



ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. రోడ్డును మంచిగా జెయ్యాలే. రాకపోకలకు తిప్పలైతుంది. అధికారులు జర పట్టించుకోవాలే. రోడ్డు బాగు చేయడమే కాకుండా కల్వర్టు నిర్మిస్తే ఇంత ఇబ్బంది ఉండదు. –పీర్‌సింగ్, తిర్మన్‌పల్లి తండా

అధికారులకు విన్నవించినం



గతంలో కురిసిన వర్షాలకు బీటీ రోడ్డు కొద్దిమేర కొట్టుకుపోయింది. అయినా అధికారులు దృష్టి పెట్టలేదు. ఇటువైపునకు వచ్చి చూసిన సందర్భాలు లేవు. వెంటనే నిధులు విడుదల చేసి, భారీ కల్వర్టును నిర్మిస్తే ఇంత ఇబ్బంది ఉండదు. –ముదుపు బాల్‌రెడ్డి, సర్పంచ్ తిర్మన్‌పల్లి

వర్షాలు తగ్గగానే పనులు చేస్తాం

వర్షాలు తగ్గుముఖం పట్టగానే దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేస్తాం. తిర్మన్‌పల్లి తండా బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. ఒక కల్వర్టు కూడా నిర్మిస్తాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. –మారుతి, ఏఈ పీఆర్, సదాశివనగర్

‘బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్ట్ అప్రజాస్వామికం’

కామారెడ్డి అర్బన్ : గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థుల పక్షాన హైదరాబాద్‌లో గన్‌పార్క్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను అడ్డుకుని హౌజ్ అరెస్ట్ చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వ అప్రజాస్వామ్యానికి నిదర్శనమని పార్టీ జిల్లా అధ్యక్షుడు బెట్టంకి బాల్‌రాజు విమర్శించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హౌజ్ అరెస్ట్‌కు నిరసనగా శనివారం కామారెడ్డి నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఆందోళన నిర్వహించారు. పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జోనల్ మహిళా కన్వీనర్ బి.వసంత, జిల్లా కోశాధికారి హరిలాల్ నాయక్, కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు దుంపల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బాల్‌రాజు

ఓటమి భయంతోనే కేటీఆర్ పర్యటన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఓటమి భయంతోనే మంత్రి కేటీఆర్ పర్యటనను ఏర్పాటు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి ఆరోపించారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన సురేందర్ ఎల్లారెడ్డిని అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ పార్టీకి అమ్ముడుపోయారని ఆరోపించారు. ఎల్లారెడ్డికి బస్ డిపోతో పాటు, పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంపు, భూంపల్లి ప్రాజెక్టు పనులు చేస్తామని హామీ ఇవ్వాలని లేని పక్షంలో మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామన్నారు. వైస్ ఎంపీపీ నర్సింలు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆఫీజ్, కాశీరాం తదితరులున్నారు.

జాతీయ గ్రంథాలయ దినోత్సవం

కామారెడ్డి అర్బన్ : జాతీయ గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఆర్ రంగనాథన్ దేశంలో గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి ఎంతో తోడ్పాటునందించారని సంస్థ జిల్లా చైర్మన్ పి.రాజేశ్వర్ అన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథపాలకుడు రాజలింగం, గ్రామపెద్దలు, పాఠకులు జైపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీహరి, రాజిరెడ్డి, రాములు, తిరుపతి, గంగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



తాడ్వాయిలో ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు

స్వీపర్ల డిమాండ్లను నెరవేర్చాలి



కామారెడ్డి రూరల్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పార్ట్ టైం స్వీపర్లు డిమాండ్ చేశారు. 45 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం, డిమాండ్లను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం మోకాళ్లపై నిల్చొని, తలకిందకు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను నెరవేర్చాలని లేకపోతే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు

రోడ్డు పనులు ప్రారంభం

బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు నుంచి బోర్లం గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలు పడటంతో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరై నెలలు గడిచినా పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ నర్సింలు, రైతుబంధు మండల డైరెక్టర్ పట్లోళ్ల దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూర్గుపల్లిలో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): బూర్గుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధుల నుంచి రూ.3 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఉప సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



బూర్గుపల్లిలో ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలోని వైశ్య సంఘం కల్యాణ మండపంలో శనివారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి అధిక వాయినం పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా 33 రకాల తీపి పదార్థాలతో అమ్మవారికి వాయినం ఇచ్చారు. దీంతోపాటు లలితాసహస్రనామాలు చదివి పూజలు చేశారు. అనంతరం మహిళలు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

‘అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తా’

రామారెడ్డి(ఎల్లారెడ్డి): అన్నారం గ్రామంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో గడప గడపకు షబ్బీర్ అన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ప్రజల సమస్యలను మాజీ మంత్రి షబ్బీర్ అలీ అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి రాగానే గ్రామంలోని సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రాజంపేట: మండల కేంద్రంలో నేడు(ఆదివారం) షబ్బీర్ అలీ ‘హాథ్ సే హాథ్ జోడో’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యాదవరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడారు.



అన్నారంలో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

సంక్షిప్తం

గ్రామ చావడి నిర్మాణానికి భూమి పూజ

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని గ్రామ చావడి భవన నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే భూమి పూజ చేశారు. రూ.2 లక్షల నిధులు కేటాయించామని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే ఎంపీపీ, జెడ్పీటీసీ దృష్టికి తీసుకొచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ అశోక్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజు, సొసైటీ చైర్మన్ బాలు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం కావాలని పూజలు

ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/రాజంపేట(ఎల్లారెడ్డి): మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతం కావాలని బీఆర్ఎస్ నాయకులు శనివారం ఎల్లారెడ్డిలో బహిరంగ సభ ప్రదేశంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తాడ్వాయి మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించి ప్రధాన రహదారుల వెంట గోడలకు అతికించారు. కేటీఆర్ సభను విజయవంత చేయాలని రాజంపేట మండలం కొండాపూర్ బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్ గణేశ్ నాయక్ కోరారు. నాయకులు సతీష్, జలంధర్‌రెడ్డి, సురేందర్, నారాయణ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఎంపీటీసీ రిలే నిరాహార దీక్ష

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఎంపీటీసీ ఉమాదేవి 17 రోజులుగా రిలే నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. తిమ్మారెడ్డికి వెళ్లే బ్రిడ్జి ఎత్తు పెంచాలని, అన్నాసాగర్ గ్రామానికి నర్వ చెరువు నుంచి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తానని అన్నారు.

బిడ్డ పుట్టిన రోజున తండ్రి రక్తదానం

కామారెడ్డి అర్బన్: తన బిడ్డ అద్వైతం పుట్టిన రోజు సందర్భంగా భిక్కనూర్ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బద్దం నిశాంత్‌రెడ్డి శనివారం స్థానిక కేబీఎస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేసినట్టు కామారెడ్డి రెడ్‌క్రాస్ సొసైటీ సమన్వయకర్త బాలు తెలిపారు. సమాజ హితం కోసం నిశాంత్‌రెడ్డి తన ఓ నెగిటివ్ రక్తాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి దానం చేయడం పట్ల పలువురు అభినందించారు.

చలో హైదరాబాద్‌కు తరలివెళ్లిన టీచర్లు



బాన్సువాడ/పిట్లం: పాత పెన్షన్ సాధన కోసం టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన చలో హైదరాబాద్‌కు బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, పిట్లం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ నేతలు మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1 తర్వాత ఉద్యోగంలో ప్రవేశించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దయ్యే వరకు ఉద్యమిస్తామని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ తలపెట్టినట్లు తెలిపారు.

నెరవేరిన ‘మెక్కా’ ప్రజల కల

- ఎమ్మెల్యే కృషితో నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని మెక్కా గ్రామానికి రోడ్డు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి యాభై లక్షలు నిధులు మంజూరు చేసింది. వాగుపై వంతెన కోసం స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి 70 ఏళ్లుగా ఎదురుచూస్తున్న మెక్కా ప్రజల కల నేటితో నెరవేరింది. సాక్షి దినపత్రికలో జులై 27న వానొస్తే మెక్కా జలదిగ్బంధమే.. రోడ్డు వేయకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం.. అని ప్రచురితమైన వార్తా కథనానికి ఎమ్మెల్యే హన్మంత్ సింధే స్పందించి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సీఎం స్పందించి నియోజకవర్గంలో ఆయా గ్రామాల రోడ్ల కోసం రూ.22 కోట్లు నిధులు మంజూరు చేశారు. మెక్కా గ్రామానికి వాగుపై హైలెవల్ వంతెన, 1.5 కిలో మీటర్ రోడ్డుకు రూ.కోటి యాభై లక్షలు నిధులు మంజూరు చేశారు. తరతరాలు ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు కోసం ఎదురుచూస్తున్న కళ నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, సీఎం కృతజ్ఞతలు తెలిపి శనివారం పాలాభిషేకం చేశారు.



మెక్కా మొరం రోడ్డు

తండాలను జీపీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దే

- ఎమ్మెల్యే జాజాల సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఈ సందర్భంగా పొల్కంపేట తండాకు 3 కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు వేయడానికి రూ.2.80 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. శనివారం ఆయన పొల్కంపేట తండా బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మారు మూల ప్రాంతాల గ్రామాలు, తండాలను గ్రామ పంచాయితీలుగా చేసి వాటి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భవనాల కోసం ఒక్కో జీపీకి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసి నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే తండాలు అభివృద్ధి చెందడానికి బీటీ రోడ్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పొల్కంపేట సర్పంచ్ పద్మ, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీటీసీ వెంకట్ మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: పద్మాజీవాడికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సాయిలు చనిపోవడంతో ఆయనకు ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేసిన అభివృద్ధిపై కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, ఆదిమూలం సతీష్‌లు సవాల్ చేశారు. శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే సురేందర్ ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని ఆరోపించడం సమంజసం కాదన్నారు. ఎల్లారెడ్డి పెద్ద చెరువు కట్టపై రూ.5 కోట్లతో నిర్మించిన బ్రిడ్జి, రూ.4 కోట్లతో నిర్మిస్తున్న బస్టాండ్, వంద పడకల ఆస్పత్రి పనులు ఇవి కాంగ్రెస్ వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వేదిక, తేది చెబితే అక్కడికి పూర్తి ఆధారాలతో వస్తామని అన్నారు. ఇకపై ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని అన్నారు. జెడ్పీటీసీ ఉషాగౌడ్, తదితరులున్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జాతీయ జెండాలతో ర్యాలీ

తాడ్వాయి/నాగిరెడ్డిపేట: తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో, నాగిరెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తపాలాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్‌కా తిరంగ్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు తపాలా శాఖ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్లు సురేష్, వేణుగోపాల్, బీపీఎంలు నాగరాజు, సంధ్యారాణి, నరేందర్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రాపహాడ్‌లో ర్యాలీలో పాల్గొన్న పోస్టల్ సిబ్బంది

గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలి

కామారెడ్డి రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి రవికిరణ్ పాడి రైతులకు సూచించారు. సరంపల్లిలో శనివారం విజయ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకేంద్రం అధ్యక్షుడు ఆకుల రవికుమార్, గోపాల మిత్ర బృందం, రైతులు బాలరాజ్, గోపాల్, అంజన్ కుమార్, రాజయ్య పాల్గొన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేస్తున్నట్లు పశుగణ సహాయకుడు కిషోర్ తెలిపారు. శనివారం కుప్రియాల్‌లో పశువులకు టీకాలు వేసి ఆయన మాట్లాడారు. సర్పంచ్ సాయిరెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్ గౌడ్, ఎంపీటీసీ స్వరూప పాల్గొన్నారు.



సరంపల్లిలో టీకాలు వేస్తున్న పశు వైద్యులు

జోయాలుక్కాస్ జువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సత్యగార్డెన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే జోయాలుక్కాస్ జువెలరీ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి ప్రారంభించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వెస్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ, కౌన్సిలర్లు గోదావరి, అపర్ణ, రీజినల్ మేనేజర్ రాబిన్ తదితరులున్నారు.